# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 77 | విశాఖపట్నం | 17-12-2025 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 77 | VISAKHAPATNAM | 17-12-2025 WEDNESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు


సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


# మేలోనే భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు






**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖను ఐటీ కారిడార్‌గా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్న కూటమి సర్కారు మరో కీలక ప్రాజెక్టు చేపట్టింది. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరం-విశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. విశాఖలో మరో ప్రతిష్టాత్మక సంస్థ ఏర్పాటుకు నాంది పడింది. దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యు సిటీకి జీఎంఆర్ గ్రూప్, మాన్సాస్ ట్రస్ట్ ఒప్పందం చేసుకున్నాయి. ఇది రాడిసన్ బ్లూ రిసార్టులో రాష్ట్ర మంత్రి లోకేశ్ సమక్షంలో జరిగింది. విశాఖ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజు, కేంద్రమంత్రి రామ్మోహనాయుడు, శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమస్థానంలో ఉంచే బాధ్యత మాదని లోకేశ్ చెప్పారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యమని స్పష్టం చేశారు. 99 పైసలకు భూములిస్తామంటే చాలామంది ఎగతాళి చేశారని ఆ నిర?యంతో కాగ్నిజెంట్, టీసీఎస్ వచ్చాయని వంద రోజుల్లో కనీసం మరో రెండు ఐటీ కంపెనీలు తీసుకొస్తామని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందంగా సిద్ధం చేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. 'వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభించాలనుకున్నామని కానీ ఒక నెల ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎడ్యుసిటీ ఉంటే ఎన్నో విద్యాలయాలు, యూనివర్సిటీలు పెట్టుకోవచ్చన్నారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపకరిస్తుంది.' కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా ప్రభుత్వం నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరం-విశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, జీఎంఆర్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నారు. దీనికి జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్ట్‌గా (తరువాయి 2వ పేజీలో)

# సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు: చంద్రబాబు




**అమరావతి, పతాకం న్యూస్:** సంజీవని ప్రాజెక్టు ద్వారా పౌరులకు డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. తద్వారా పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. వైద్యారోగ్య నిపుణుల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యారోగ్య రంగంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఆరోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాలని అధికారులకు సీఎం సూచించారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున పెరగాలన్నారు. రాష్ట్రంలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనారోగ్యం పాలయ్యాక ఆస్పత్రుల చుట్టూ తిరిగే కంటే ముందస్తుగానే వాటిని నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్?పై దృష్టి పెట్టాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావాలని సూచించారు. సామర్థ్యాల పెంపుతోపాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలని ఆదేశించారు. క్వాంటం, ఏఐతో రియల్ టైమ్ డేటా విశ్లేషణ లాంటి వాటి ద్వారా ప్రజలకు సేవలందాలన్నారు. ప్రస్తుతం ఏఐ ద్వారా నాలెడ్జి వ్యవస్థీకృతమైందని తెలిపారు.గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామని చెప్పారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ద్వారా ఇంటిగ్రేట్ చేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ అంశాల్లో పౌరులకు (తరువాయి 2వ పేజీలో)

# ఆరోగ్య వ్యవస్థలో మార్పులు ఖాయం: సత్యకుమార్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావడం జరుగుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 10 వ్యాధులను మ్యాపింగ్ చేసి ఎక్స్‌పర్ట్స్ ఆలోచనలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ చేయటం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్స్‌తో ఉండే శాస్త్రవేత్తలు ఈ గ్రూప్‌లో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాలలో ఉన్న ఈ సైంటిస్ట్‌లు వర్చువల్ విధానంలో మొదటి సమావేశానికి హాజరయ్యారన్నారు. వ్యక్తిగత చికిత్స అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ పనిచేస్తుందని అన్నారు. ఆరోగ్య వ్యవస్థను పటిష్టత చేసే యోచనలో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇక.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై మంత్రి స్పందించారు. కోటి సంతకాల రాద్ధాంతం మొదలైందని.. ఇది కోడి గీతల కార్యక్రమం అంటూ ఎద్దేవా చేశారు. సుపరిపాలన యాత్రలో ఎవరు కూడా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనలేదని తెలియజేశారు. లక్షల మందిలో కనీసం ఒక్కరు కూడా సంతకం చేసిన దాఖలు లేవన్నారు. గ్రామ, పట్టణ, కళాశాలలో కానీ పేదలలో ఎలాంటి చర్చ లేదన్నారు. కార్యకర్తలకు సంతకాలు పెట్టి చేతులు వాసిపోతున్నాయని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# గత ప్రభుత్వ రాజకీయ కక్షల వల్లే భూ సమస్యలు పెరిగాయి: నాదెండ్ల



**ఏలూరు, పతాకం న్యూస్:** రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా 22 భూ సమస్యల పరిష్కారం కోసం ఏలూరు జిల్లాలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మెగా 22ఏ భూ సమస్యల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని ప్రజలు, రైతుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ... గత ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యల కారణంగా రాష్ట్రంలో 22ఏ భూ సమస్యలు తీవ్రంగా మారాయని ఆరోపించారు. తమకు అనుకూలంగా లేని వారి ప్రైవేట్ భూములను కూడా ఉద్దేశపూర్వకంగా 22ఏ జాబితాలో చేర్చారని, దీనివల్ల సామాన్య ప్రజలు, రైతులు తమ భూములను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు.



2లో

## కేంద్రమంత్రులతో రేవంత్ రెడ్డి వరుస భేటీ

# జగన్‌పై మంత్రి అనగాని ఫైర్

**రేపల్లె, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారంరేపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రేపల్లెలో 41 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు మంత్రి అనగాని సత్యప్రసాద్. జగన్ హయాంలో పీపీపీ విధానంలో అయితే మెడికల్ కాలేజీల నిర్మాణానికి 25 ఏళ్లు పట్టేదని విమర్శించారు. కానీ వైసీపీ నేతలు వంద సంతకాల పేరుతో సిగ్గు లేకుండా తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. జగన్‌కు అసలు రుషికొండపై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పులివెందులలో కూడా మెడికల్ కాలేజీ నిర్మించలేకపోయిన అసమర్థుడు జగన్ అని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఎద్దేవా చేశారు .



జగన్ ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ఐదు మెడికల్ కాలేజీలు కూడా కట్టలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేపల్లె నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద రూ.10 కోట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పీపీపీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా హర్షించిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో పీపీపీ విధానంలో రెండేళ్లలోనే మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టామని తెలిపారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## రాజధాని విన్యాసాలు

రాజధాని అమరావతి విషయంలో పదకొండేళ్లుగా కేంద్రంలో పాలన వెలగబెడుతున్న మోడీ ప్రభుత్వం కప్పగంతుల వైఖరి తీసుకోవడం రాజకీయ దివాళాకోరుతనమే! తాజాగా అమరావతికి చట్టబద్ధత కల్పనపై తీవ్ర గందరగోళం సృష్టించి రాష్ట్ర ప్రజలను, రాజధాని కోసం భూములిచ్చిన రైతులను అయోమయంలోకి నెట్టి చోద్యం చూడటం క్షమించరానిది. రాజధాని విస్తరణకు రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌నకు టిడిపి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తుండగా, అమరావతే రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని పదేళ్ల క్రితం భూములిచ్చిన రైతుల నుంచి డిమాండ్ బలంగా ముందుకొచ్చింది. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమ గతేమిటన్న నిలదీతలను కూటమి నేతలు ఎదుర్కొంటున్నారు. సమస్య నుంచి బయటపడటానికి చట్టబద్ధతను తెరమీదికి తెచ్చారు. న్యాయశాఖ అమోదంతో సహా చట్టబద్ధత బిల్లునకు అన్ని చర్యలూ కేంద్రంలో స్పీడుగా సాగుతున్నాయని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు వస్తుందని కూటమి అనుకూల మీడియా విస్తృత ప్రచారం లంకించుకోగా, రాష్ట్ర సర్కార్ ఆ ప్రతిపాదనను లీగల్ బూచితో కేంద్రం తిప్పిపంపిందని వ్యతిరేక మీడియా కౌంటర్ ప్రచారం ఎత్తుకుంది. ఈ సమావేశాల్లో బిల్లు రాదన్న కబురు కేంద్ర మంత్రి పెమ్మసాని చల్లగా చెప్పారు.

యుపిఎ-2 ప్రభుత్వం పార్లమెంట్‌లో తెచ్చిన ఎ.పి. పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని బిజెపి రెండు చేతులా ఆహ్వానించడంతోపాటు ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చింది. 2015 దసరా రోజున ప్రధాని మోడీ అమరావతికి శంకుస్థాపన చేశారు. అప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు కావాలని రిపోర్టులు పంపగా కేంద్రం రూ.1,500 కోట్లు విదిల్చింది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి మూడు రాజధానుల ఆటతో గందరగోళం సృష్టించగా, కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం నిలువరించకపోగా, రాజధాని అంశం తమ పరిధిలో లేదని, రాష్ట్రం ఇష్టమని న్యాయస్థానాల్లో అఫిడవిట్లు ఇచ్చి అయోమయానికి ఆజ్యం పోసింది. మోడీ శంకుస్థాపన చేసిన విషయాన్ని కూడా మర్చిపోయి మూడు కాకపోతే ముప్పై పెట్టుకోమని బిజెపి పెద్దలు గేలిచేసి రాష్ట్ర ప్రజలకు ద్రోహం తలపెట్టారు. మరలా 2024 ఎన్నికల్లో టిడిపిని అక్కున చేర్చుకొని కేపిటల్ గేమ్ ఆడుతున్నారు. రెండవ తడవ ప్రధాని అమరావతి పనులకు శంకుస్థాపన సమయంలో రాజధాని రైతులు చట్టబద్ధతపై పట్టుబట్టగా సభా వేదిక నుంచి ప్రధానితో ఆ విషయాన్ని చెప్పిస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చినా అది జరగలేదు. దాంతో అమరావతి కథకు ముగింపు లేకుండా పోయింది.

అమరావతికి టిడిపి సర్కార్ తొలుత 33 వేల ఎకరాలను సమీకరించింది. భూములిచ్చిన రైతులకు హామీ ఇచ్చిన మేరకు ఇప్పటి వరకు అభివృద్ధి పర్చిన ప్లాట్లు ఇవ్వలేదు. ప్రభుత్వం మారిన ఐదేళ్లల్లో వారి పరిస్థితి అగమ్యగోచరమైంది. వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే, మరోసారి 20 వేల ఎకరాల సమీకరణకు సర్కార్ నోటిఫికేషన్ ఇచ్చేసింది. మరో 20 వేల ఎకరాలంటోంది. భుములివ్వకపోతే అమరావతి మున్సిపాలిటీగా మిగులుతుందని ముఖ్యమంత్రి అన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ప్రభుత్వ పెద్దల బెదిరింపులు రైతుల్లో మరింత గుబులు రేపుతున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వమేమో చట్ట ప్రకారం రాజధానికి బడ్జెట్ నుంచి నిధులివ్వకుండా అప్పులు చేయమంటోంది. స్వయం పోషక రాజధానని చెప్పిన టిడిపి రుణాల బాట పట్టింది. ఈ పూర్వరంగంలో చట్టబద్ధత కల్పిస్తేనే తమకు నమ్మకం కుదురుతుందన్న రైతుల డిమాండ్ సహేతుకమైనది. అమరావతికి రెండుసార్లు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల, బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అటువంటి అమరావతికి చట్టబద్ధత కల్పనకు కేంద్రానికి ఏం ఇబ్బందొచ్చిందో అంతుబట్టదు. కేంద్రం తమ ప్రతిపాదనకు కొర్రీలేసి తిరస్కరించినా టిడిపి-జనసేన ఎందుకు మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి చేయట్లేదో తెలీదు. అమరావతిపై వీళ్ల విన్యాసాలు ఇంకెన్నేళ్లు రాష్ట్ర ప్రజలు భరించాలి? నాలుగు పార్టీల తొండాటపై ఇకనైనా రాజధాని రైతులు, యావత్ రాష్ట్ర ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

## కేంద్రమంత్రులతో రేవంత్ రెడ్డి వరుస భేటీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. రెండు రోజుల క్రితం మెస్సీతో మ్యాచ్ అనంతరం ఆయన హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రెండు రోజులుగా ఆయన ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఆయన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి కోరారు. అనంతరం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమయ్యారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయి బిల్లులను చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ర్యాలీ




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ రూ.6,400 కోట్లు బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించకూడదని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షుడు గౌతమ్ మాట్లాడుతూ స్కాలర్షిప్‌లు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మాకవరపాలెం మెడికల్ కాలేజీని పీపీపీకి ఇవ్వడం వల్ల విద్యార్థులు, ప్రజలు నష్టపోతారని అన్నారు. మహిళా విద్యార్థుల భద్రత, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు, మెస్ ఛార్జీలు రూ.3000కు పెంపు, జీఓ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరేవరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మూర్తి, శ్రీను, వరుణ్, అవినాష్, చరణ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగవరంలో క్రిస్టమస్ వేడుకలు



**పెదగంట్యాడ, పతాకం న్యూస్:** గాజువాక జోన్ 64 వ వార్డు గంగవరం దార వీధి లో క్రిస్మస్ వేడుకల శుభ సందర్భంగా చిన్న రావు, పాస్టర్ సామ్యూల్ ఆహ్వానం మేరకు పెద్దలు, వాక్య సంబోధకులు పాస్టర్ తిమోతి హాజరై దైవ సందేశం వినిపించారు. 64 వార్డు ప్రెసిడెంట్, విశాఖ జిల్లా మాజీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చోడి పిల్లి ముసలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ముసలయ్య మాట్లాడుతూ మతాలు ఎన్ని వేరైనా మనుషులు ఒక్కటే తత్వాలు వేరైనా ధర్మమొక్కటే అని పిలుపునిచ్చారు. ఈ కూటమి ప్రభుత్వం అన్ని మతాలను ఒకే విధంగా ఆదరిస్తుందని అందరూ కలిసికట్టుగా దేశ శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. సమానత్వమే అందరికీ ప్రాథమిక హక్కని సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కారి గోపి, కన్నయ్య, రాజు, సంఘ ప్రియ మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభల కోసం విరాళాల సేకరణ



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** మాకవరపాలెంలో ఆశా, మధ్యాహ్న భోజన పథక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సీఐటీయూ అఖిల భారత మహాసభల జయప్రదానికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. సత్యవతి, మిడ్డే మీల్ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె. ప్రసన్న మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా జరుగుతున్న సీఐటీయూ జాతీయ మహాసభలకు దేశ విదేశాల నుంచి 2000 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. జనవరి 4న ఆర్కే బీచ్‌లో భారీ బహిరంగ సభ, డిసెంబర్ 27 నుంచి జనవరి 7 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి. శివ, సిహెచ్. వరలక్ష్మి, యన్. సూర్యలక్ష్మి, యన్. ధనలక్ష్మి, ధమయంతి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి రవీంద్ర ను కలసిన కశింకోట మండల టీడీపీ ఐ అధ్యక్షులు



**కశింకోట, పతాకం న్యూస్:** జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్రను అనకాపల్లి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సమక్షంలో ఇన్చార్జ్ మంత్రి కోళ్ళు రవీంద్ర ను కశింకోట మండల ఐ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గంటా యువసేన కన్వీనర్ జె్రిపోతుల నూకునాయుడు సాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గోవింద సత్యనారా యణ సమక్షంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారని ఈ ఉత్సాహాని రానున్న స్థానిక ఎన్నికల్లో చూపించాలని అన్ని పంచాయతీ లు ఎంపీటీసీ లు కూటమి ప్రభుత్వమే గెలుస్తుందని తెలియజేశారు.

## గర్భిణులకు ప్రత్యేక వైద్యం అందించాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం. హైమావతి**




**అనకాపల్లి ప్రతినిధి, పతాకం న్యూస్:** గర్భిణులకు ప్రత్యేక వైద్యం అందించాలి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం. హైమావతి సూచించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి హైమావతి అధ్యక్షతన వారి కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అందరికీ సమీకృత అధిక ప్రమాదకర సమస్యలు గుర్తించుట, నిర్వహణ పై శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులకువచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి వైద్యం అందిందాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీస్త్రీలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. డిఐఓ డాక్టర్ కె.చంద్రశేఖర్ దేవ్ మాట్లాడుతూ గర్భిణులకువచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి ప్రత్యేకవైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలాచూడాలని తెలియజేశారు. ఈ శిక్షణాకార్యక్రమంలో ఎన్సీడీ, సీడీ పి ఓ డాక్టర్ ఎస్తేరు రాణి, చోడవరం సిహెచ్సి గైనకాలజిస్ట్ డాక్టర్ విష్ణు ప్రియ, టీబీ, జ్వరం, గుండె జబ్బు, ప్రీవియస్ సి సెక్షన్, ఫీటల్ గ్రోత్ రిస్టర్ క్షణ్ వంటి అంశాల పై వివరించారు. ఆర్మన్ స్వచ్ఛంధసంస్థ సిబ్బంది డాక్టర్ శివ ప్రసాద్ దొంగల శిక్షణకు సంబంధించిన కోర్సు మెటీరియల్ సరఫరా చేసి గ్రామస్థాయిలో వైద్యాధికారుల విధుల గురించి తెలియజేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## మేలోనే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

నామకరణం చేశారు. ఈ ఏవియేషన్ వర్సిటీ రాకతో ఇంటర్నేషనల్ శిక్షణ పొందవచ్చని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి అన్నారు. ఇలాంటి గొప్ప సాంకేతిక విద్యాసంస్థ మన ప్రాంతానికి రావడం ఎంతో సంతోషమని తెలిపారు. గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ అవకాశాలు అందిపుచ్చుకోవడంలో సీఎం ముందుంటారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు మూలకేంద్రంగా యూనివర్సిటీ పని చేస్తుందని వివరించారు. ఇటీవలే విశాఖలో 9 ఐటీ కంపెనీలకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టిందన్నారు. ఎన్టీఆర్ హయాంలో ఉత్తరాంధ్రకు గుర్తింపు వచ్చిందని, నేడు మళ్లీ చంద్రబాబు హయాంలో అభివ ృద్ధి వచ్చిందని ఆయన అన్నారు. రాజకీయాలు ఉండాలిగానీ అభివ ృద్ధి సమయంలో అందరూ కలవాలని, పూసపాటి కుటుంబం విద్యాభివ ృద్ధికి ఆస్తులు ధారాదత్తం చేసిందని వివరించారు. ఇంత చేసినా ప్రచారం చేసుకోని గొప్ప సంస్కారం వారి ఔన్నత్యమని అయ్యన్నపాత్రుడు కొనియాడారు. దేశంలోని తొలిసారి ఏవియేషన్ శిక్షణ కేంద్రం మొదలవుతోందన్నారు. ఏవియేషన్ రంగంలో నైపుణ్యం ఉన్నవారి కొరత ఉందని, కేవలం మన దేశంలోనే కాదు ఇతర దేశాల్లోనూ మంచి ఉపాధి అవకాశాలున్నాయని జీవీఎస్ రాజు పేర్కొన్నారు.

## సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు: చంద్రబాబు

సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో వినూత్న ప్రాజెక్టులు : ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. అనారోగ్యానికి గురైన తర్వాత తీసుకునే జాగ్రత్తల కంటే ఆ జబ్బు రాకుండా ముందస్తుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా వైద్యారోగ్యంపై వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి ఎక్స్?పర్ట్ గ్రూప్?లు సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సామర్థ్యాల పెంపుతో పాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలని తేల్చిచెప్పారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ నూతన విధానాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏపీలో మెరుగైన ప్రజారోగ్య నిర్వహణకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్యారోగ్య రంగంలోని నిపుణులతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షకు హాజరయ్యింది. సలహా బృందంలో యూఎస్? ఏఐడీఎస్? ప్రతినిధి పీటర్ పాయింట్, డబ్ల్యూహెచ్?ఓ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్, ఏఐజీ చైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ ప్రతినిధి ప్రొఫెసర్ ఇక్? ఇంగ్ టియో, ఆర్తి అహుజా, రిజ్వాన్ కొయిటా, శ్రీకాంత్ నాదముని, గగన్ దీప్ కాంగ్, మార్గరెట్ ఎలిజిబెత్, నిఖిల్ టాండన్, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ పాల్గొన్నారు.

# ఉక్కు కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి



**గాజువాక, పతాకం న్యూస్:** స్టీల్ కార్మికులు గడచిన సంవత్సర కాలంగా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని స్టీల్ ప్లాంట్ నూతన డైరెక్టర్ ఫైనాన్స్ వినయ్ కుమార్ ని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు రామస్వామి, జె అయోధ్య రామ్ ఆయన కార్యాలయంలో కలిసి అభినందిస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జె అయోధ్య రామ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ ఫైనాన్స్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినయ్ కుమార్ ని ముందుగా అభినందించారు. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి నిలకడగా జరగడానికి అవసరమైన రా మెటీరియల్ అందుబాటులో ఉంచడం కోసం గతంలో ఎదుర్కొన్న విధంగా ఫైనాన్స్ అవరోధాలు రాకుండా చూడాలని కోరారు. అదేవిధంగా గడచిన సంవత్సరం కాలంగా స్టీల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ కార్మికులను ఉత్సాహపరిస్తే ఉత్పత్తి ఉత్పాదకతలను స్టీల్ కార్మికులు మరింత చురుకుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలియజేశారు. ప్రధానంగా స్టీల్ కార్మికులకు చెల్లించాల్సిన 355% బకాయి పడిన జీతం మరియు ఈనెల 12% జీతం చెల్లించి కార్మికులను ఉత్సాహపర చాలని ఆయన అన్నారు. కనుక మీరు ఆ దిశగా చర్యలు చేపడితే పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి స్టీల్ కార్మికుల సిద్ధంగా ఉన్నారని ఆయన తెలియజేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ ప్రధానంగా స్టీల్ కార్మికులకు హెచ్ ఆర్ ఎ చెల్లించకుండా, త్రిఫ్ట్ సొసైటీ రికవరీని పునరుద్ధరించడం, ఈ ఎల్ లు అమ్ముకోవడానికి అవసరమైన అనుమతులను ఇవ్వాలని ఆయనను కోరారు. అలాగే ఉక్కు నగరంలో నివసిస్తున్న కార్మికుల కరెంటు చార్జీలు తగ్గించే చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

## లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకు రూ.771.65 కోట్ల ఆదాయాన్ని సాధించింది. గత ఏడాది ఇదే కాలానికి రూ.681.11 కోట్లు ఆదాయం వచ్చింది. దాంతో పోల్చితే 13.29 శాతం వృద్ధి కనిపిస్తోంది. అయితే ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం పరంగా చూసుకుంటే 85.85 శాతమే సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యం రూ.1,357.85 కోట్లు కాగా నవంబరు చివరికి ఇచ్చిన లక్ష్యం రూ.898.81 కోట్లు. అందులో నవంబరు నెలాఖరు నాటికి రూ.771.65 కోట్లు మాత్రమే సాధించారు. దీనిపై రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కొద్దిరోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి లక్ష్యాలను 100 శాతం సాధించడానికి ప్రతి కార్యాలయం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ లోపాలున్నాయో, ఏయే రిజిస్ట్రేషన్లు జాప్యం జరుగుతున్నాయో గుర్తించి వాటిని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో వాతావరణం పెట్టుబడులకు అనుకూలంగా ఉండడం వల్ల పెద్ద పెద్ద పరిశ్రమలు వస్తున్నాయని, తద్వారా రియల్ ఎస్టేట్ రంగం కూడా విస్తరిస్తున్నదని, అవన్నీ కార్యరూపంలోకి వచ్చేందుకు ఒప్పందాలు పురోణి స్థాయిలో ఆగిపోకుండా రిజిస్ట్రేషన్ల వరకు వచ్చేలా చూడాలని సూచించారు.

## వాక రోడ్డు నిర్మాణానికి అనుమతులు



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** నాలుగు మండలాల ప్రజల నాలుగు దశాబ్దాల నాటి కల నెరవేరనుంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో వాక రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 12 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.10.4 కోట్లు మంజూరు చేస్తూ అనుమతుల కాపీని ఈ నెల 10వ తేదీన పంచాయతీరాజ్ శాఖకు పంపింది. దీంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాకవరపాలెం మండలం రామన్నపాలెం సెంటర్ నుంచి ఎలమంచిలి నియోజకవర్గం పెదపల్లి వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించాలని 1983 నుంచి ప్రతిపాదన ఉంది. ఆ తరువాత ఎన్నో అవాంతరాలు రాగా, తాజాగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో ఎట్టకేలకు ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. రామన్నపాలెం సెంటర్ నుంచి ఎరకన్నపాలెం గ్రామాన్ని ఆనుకొని ఏపీఐఐసీ భూముల వరకు సుమారు ఆరు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు, అక్కడ నుంచి ఏపీఐఐసీ భూముల గుండా మరో రెండు కిలోమీటర్ల మేర ఎరకన్నపాలెం గ్రామం వరకు రోడ్డు నిర్మాణాన్ని ఏపీఐఐసీ అధికారులు చేపడుతున్నారు. అక్కడ నుంచి ప్రారంభమై వాక రోడ్డు నుంచి ఎలమంచిలి నియోజకవర్గం పెదపల్లి వరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రోలుగుంట, నర్సీపట్నం, రావికమతం, మాకవరపాలెం మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

## మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటీయు డిమాండ్



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నంలో విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న మీటర్ రీడర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3,000 మంది మీటర్ రీడర్స్ పీస్‌రేట్ విధానంలో పని చేస్తూ కనీస వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయ కులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల అమలుతో ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వమే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, జిల్లా నాయకులు సూరి శెట్టి అప్పలకొండ, డివిజన్ ప్రెసిడెంట్ కరణం సంతోష్, చింతకాయిల వెంకట రమణ, వంటాకుల శ్రీరామ్మూర్తి, బోడ్డేటి వెంకట సూరి అప్పావు, ఎ. వెంకట రమణ, ఇంజవరపు దార, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోర్టు స్టేడియాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అక్కయ్యపాలెంలోని క్రీడా ప్రాంగణం, కళావాణి ఆడిటోరియంను విశాఖపట్నం పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నెహ్రూ క్రీడా, సాంస్కృతిక సముదాయం, కళావాణి ఏసీ ఆడిటోరియంలను విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్, విశ్వనాథ్ ఎవెన్యూస్‌కు లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ సంస్థ నిబంధనలు, షరతులు ఉల్లంఘించడంతో లీజు రద్దు చేస్తున్నామని సెప్టెంబరు 11న పోర్టు యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. దానిపై విశ్వనాథ్ అండ్ కో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అక్కడ పోర్టుకు అనుకూలంగా తీర్పు రావడంతో యాజమాన్యం ఆయా ప్రాంగణాల ముందు నోటీసులు ఏర్పాటుచేసింది. లీజు రద్దు చేసినందున విశ్వనాథ్ అండ్ కోతో ఎవరైనా ఒప్పందాలు చేసుకొని ఉంటే అవి చెల్లవని స్పష్టంచేసింది. దీనిపై పత్రికల్లో ప్రకటన జారీచేసింది. సోమవారం ఉదయాన్నే జిల్లా రెవెన్యూ అధికారులను తీసుకొని వెళ్లి స్టేడియంతో పాటు ఆడిటోరియాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో పెద్దస్థాయిలో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని స్టేడియం వద్ద పోర్టు యాజమాన్యం మోహరించింది. ఆ ప్రాంగణంలో కొన్ని విభాగాలను సబ్ లీజుకు తీసుకున్న వారిని, వారి దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని బయటకు పంపించారు. సోమవారం రాత్రి చీకటి పడేంత వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. అయితే ఇదే ప్రాంగణంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కార్యాలయం, శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. బాక్సింగ్ తదితర క్రీడల్లో చాలా మంది శిక్షణ పొందుతున్నారు. వారికి హాస్టల్ కూడా అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. యథా ప్రకారం సోమవారం సాయంత్రం విద్యార్థులు శిక్షణ కోసం తల్లిదండ్రులతో సహా అక్కడకు రాగా సెక్యూరిటీ సిబ్బంది వారిని గేటు వద్దే నిలిపివేశారు. సాయ్ ఇచ్చిన గుర్తింపు కార్డులు చూపిస్తే లోపలకు పంపిస్తామని స్పష్టంచేశారు. రోజూ వస్తుండే స్టేడియమే కాబట్టి గుర్తింపు కార్డులు తేలేదని, ఆకస్మికంగా ఇలా నిబంధనలు పెడితే ఎలా అంటూ సెక్యూరిటీ సిబ్బందితో పిల్లల తల్లిదండ్రులు వాదనకు దిగారు. తమ చేతుల్లో ఏమీ లేదని, గుర్తింపు కార్డులు ఉంటేనే లోపలకు పంపుతామని, ఇంతకు ముందులా ఎవరు పడితే వారు లోపలకు వెళ్లడానికి అనుమతించబోమని స్పష్టంచేశారు. అలాగే స్టేడియానికి చాలామంది వాకింగ్ కోసం వెళు తుంటారు. వారిని కూడా ఆపేశారు. గుర్తింపు కార్డు ఉన్నవారినే లోపలకు పంపించారు. సాధారణ స్థితికి రావడానికి వారం రోజుల సమయం పడుతుందని వారు పేర్కొన్నారు. పోర్టు, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, నియమ నిబంధనల ప్రకారం ఆస్తుల రక్షణకు చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పోర్టు యాజమాన్యం సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది. స్టేడియం, ఆడిటోరియాలలను భవిష్యత్తులో ఏ విధంగా ఉపయోగించుకోవాలనే దానిపై ఆలోచన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

## రైతు బజార్ పట్ల అధికారులు, నాయకుల స్పందన కరువు!

### ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని అనకాపల్లి నెహ్రూ చౌక్ సెంటర్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో గత 17 రోజులు గా ఏర్పాటు చేసినటువంటి రిలే నిరాహార దీక్ష నేటికీ మంగళవారం కు 18వ రోజుకు చేరుకుంది. గత 17 రోజులు గా రిలే నిరాహార దీక్షచేపట్టినప్పటికి రైతు బజార్ పట్ల అధికారులు నాయకులు స్పందన కరువైయ్యింది. రైతుల పట్ల రైతు బజార్ విషయంలో అధికారులు నాయకులు నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుంది. రైతు బజార్ ప్రారంభిస్తే రైతులందరూ ఆనందిస్తారు. ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ అనకాపల్లి పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఆకుకూరలు, కూరగాయల పంటలు ఎక్కువగా పండిస్తారని పేద మధ్యతరగతి కుటుంబాలకు అన్ని ఆకుకూరలు కూరగాయలు తక్కువ ధరకు లభిస్తాయని తాజా కూరగాయలు కు ప్రజలు కూడా రైతును కాపాడుకోవాలని ఎప్పటినుంచో అనుకుంటున్న 18వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో అనకాపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, ఎల్లపు రామశేషు, ఎస్. ప్రకాష్, గొర్లి వెంకటేశ్వరరావు, వై. గోపి దీక్షలో పాల్గొన్నారు.

## హాకీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిన నక్కపల్లి



**నక్కపల్లి, పతాకం న్యూస్:** పదేళ్ల క్రితం వరకు నక్కపల్లి ప్రాంత పిల్లలకు, యువతకు హాకీ అంటే ఏమిటో తెలియదు. హాకీ స్టిక్‌నుగానీ, బాల్‌ను కూడా చూసి వుండరు. ఇటువంటి తరుణంలో హాకీ క్రీడాకారుడిగా స్పోర్ట్స్ కోటాలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన బలిరెడ్డి సూరిబాబు... తనలాగే మరెంతో మందిని హాకీ క్రీడలో తీర్చిదిద్దాలని నిర్ణయించకున్నారు. స్థానికులైన మరో ముగ్గురు ఔత్సాహికులతో కలిసి 'బీఎస్ హాకీ క్లబ్'ను ఏర్పాటు చేశారు. హాకీ సాధన కోసం ఇళ్లకు వెళ్లి పిల్లలను బతిమాలారు. హాకీ స్టిక్స్, బాల్స్, టీ షర్ట్‌లు, ఇతర పరికరాలు అన్నీ తామే సమకూరుస్తామని చెప్పారు. పిల్లలను గ్రౌండ్‌కు పంపేలా తల్లిదండ్రులను ఒప్పించారు. తొలుత ఐదారుగురు మాత్రమే హాకీ తర్ఫీదుకు రాగా.. ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ఐదేళ్లు తిరిగేసరికి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగారు. పదేళ్ల కాలంలో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారు. జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోనే 'నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్'కు ఒక గుర్తింపు లభించింది. హాకీ క్రీడ ద్వారా ప్రతిభ కనబర్చి, పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బలిరెడ్డి సూరిబాబు నక్కపల్లిలో హాకీ క్లబ్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఆయనకు స్థానికంగా వున్న భవన నిర్మాణ కార్మికుడు కొల్నాటి తాతాజీ, సీనియర్ కళాకారుడు చిన్న అప్పారావు, జాతీయ క్రీడాకారుడు చిన్న అప్పారావు అండగా నిలిచారు. 2016 ఆగస్టులో స్థానికంగా వుండే కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హాకీ ఆటపై అవగాహన కల్పించారు. మీరేమీ ఖర్చు పెట్టనక్కరలేదు. అంతా తామేచూసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. తొలుత 10 మంది పిల్లలతో 'బీఎస్ హాకీ క్లబ్'ను స్థాపించారు. హాకీ నేర్చుకోవడానికి ఒక్కొక్కరిగా విద్యార్థులు రావడం మొదలుపెట్టారు. రెండేళ్లు తిరిగే సరికి 40 మందికి పెరిగారు. వారికి టీ షర్ట్‌లు, క్రీడా సామగ్రితోపాటు రోజూ పాలు, స్నాక్స్ అందజేశారు. మూడో సంవత్సరం నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే నైపుణ్యతను సాధించారు. అలా 10మందితో ప్రారంభమైన హాకీ క్లబ్‌లో ఇప్పుడు అండర్-14, అండర్ -17, అండర్-19 విభాగాల్లో 200 మంది క్రీడాకారులు వున్నారు. వీరిలో పలువురు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఇదే సమయంలో 46 మంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో స్పోర్ట్స్ పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు పొందారు. 10 మంది హాకీ క్రీడాకారులు ఆర్మీ సహా పలురకాల ఉద్యోగాలు పొందారు. నక్కపల్లిలో నాలుగు పర్యాయాలు రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించారు. అండర్ -14, అండర్-17 విభాగాల్లో రెండుసార్లు, ఎస్‌జీఎఫ్ 68, 69వ అండర్-19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఇక్కడ జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా నక్కపల్లిలో ఆస్ట్రో టర్ఫ్ హాకీ మైదానాన్ని రూ1.6 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఏపీలో ఇటువంటి మైదానాలు నాలుగు మాత్రమే వుండగా.. వాటిలో నక్కపల్లిలో ఒకటి కావడం విశేషం. సహజసిద్ధమైన గడ్డి కంటే పదునుగా వుండే కృత్రిమ గడ్డితో చేసిన దాన్నే ఆస్ట్రో టర్ఫ్ మైదానంగా పిలుస్తారు. హాకీ సాధన కోసం ఈ మైదానాన్ని వినియోగస్తున్నారు.

## ముందుస్తూ జాగ్రత్త చర్యలుగా వీధి కుక్కలకు రేబిస్ టీకాలు



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలోని గ్రామస్తులపై ఇటీవల వీధి కుక్కలు దాడి చేసిన ఘటనల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఏ.ఎల్.పురం గ్రామంలో వీధి కుక్కలకు రేబిస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిం చారు. పశువైద్యాధికారి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో మొత్తం 15 వీధి కుక్కలకు, 5 పెంపుడు కుక్కలకు రేబిస్ (పిచ్చికుక్క వ్యాధి) నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష గ్రామస్తులతో మాట్లాడుతూ కుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీరు మరియు లైఫ్‌బాయ్ సబ్బుతో శుభ్రంగా కడగాలని సూచించారు. ఆలస్యం చేయకుండా మొదటి మూడు గంటల్లోనే వైద్యులను సంప్రదిస్తే పిచ్చికుక్క వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేయడం సాధ్యమవుతుందని తెలిపారు. పిచ్చికుక్క వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని స్పష్టం చేస్తూ, కుక్క కరిచిన వెంటనే తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ టీకాల కార్యక్రమంలో కేడీపేట పశువైద్యశాల పరిధిలోని పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన సతీష్ కుమార్‌కు జనసేన నేతలు అభినందనలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియ మితులైన వి. సతీష్ కుమార్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ, ప్రజారాజ్యం పార్టీ నుంచి నిస్వార్థంగా పనిచేస్తూ జనసేన వ్యవస్థాపకుల్లో కీలక పాత్ర పోషించిన సతీష్ కుమార్ గిరిజన సమస్యలు, శ్రీకాకుళం జిల్లా కిడ్నీ వ్యాధిగ్రస్తుల అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ఆయనకు ఈ పదవి రావడం జనసేన కార్యకర్తలకు ప్రేరణనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల ప్రధాన కార్యదర్శి మోపాడ చిరంజీవి, మోపాడ సోమేశ్, దాసరి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో గంజాయిని శాశ్వతంగా నిర్మూలించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గంజాయి నిర్మూలనపై ఎస్పీ అమిత్‌బర్ధార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు, వినియోగంపై అధికారులకు పక్కా సమాచారం ఉండాలని, జిల్లాలో గంజాయి సాగు చేయడానికి ఎవరూ సాహసించకూడదన్నారు. అలాగే గ్రామ స్థాయిలో గంజాయి స్థితిగతులపై అధికారులు సర్వే చేపట్టి, దశల వారీగా నిర్మూలనపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. గంజాయి సాగుతో కలిగే నష్టాలపై ప్రజలకు, వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజనుల్ని గంజాయి సాగు నుంచి విముక్తి చేసి, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో, ఇతర విద్యాలయాల్లోనూ గంజాయి వల్ల కలిగే నష్టాలపై ప్రణాళికా బద్ధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాటిని మండల విద్యాశాఖాధికారులు, సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారులు బాధ్యతగా పర్యవేక్షించాలన్నారు. గంజాయిని వీడిన గిరిజన రైతులకు స్వయం ఉపాధి కల్పన, బ్యాంకు రుణాలు మంజూరు మంజూరు చేయాలన్నారు. గంజాయి సాగు, రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. విద్యాలయాల్లో స్పోర్ట్స్ క్లబ్‌లు ఏర్పాటుతో పాటు ఫిర్యాదుల పెట్టెలు పెట్టాలన్నారు. మండలానికి ఒకటి చొప్పున యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతను సానుకూల దృక్పథం వైపునకు నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదికర్మ యోగి సేవా కేంద్రాల్లోని సిబ్బందికి గంజాయి సాగు, రవాణాను గుర్తించేలా అవసరమైన శిక్షణలు అందించాలని గిరిజన సంక్షేమ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ అమిత్‌బర్ధార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యవహారాల్లో సంబంధాలున్న వారి బంధువులపైనా తాము నిఘా పెట్టామన్నారు. గంజాయి ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని, గంజాయి స్మగ్లర్లకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రతి చోటా పటిష్ఠ నిఘా పెట్టామని, ఈ క్రమంలో అందరూ గంజాయికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఈగిల్ రూపొందించిన పోస్టర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో పి.అంబేద్కర్, ఆర్‌డీవో ఎంవీఎస్.లోకేశ్వరరావు, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా గ్రామీణాభివృద్ధికి సంస్థ పీడీ వి.మురళి, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, ఎల్‌డీఎం మాతునాయుడు, ఏడీఎంహెచ్‌వో టి.ప్రతాప్, జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి ఎస్.భీమశంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.గౌరిశంకరరావు, ఈగల్ బృందం, అటవీ, వెలుగు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగహన సదస్సు



**చోడవరం, పతాకం న్యూస్:** చోడవరం సీఐ ఆదేశాలు ప్రకారం చోడవరం మండలం పరిధిలోని ఎస్ ఎస్ ఎస్ ఎస్ డిగ్రీ మరియు జూనియర్ కాలేజ్, చోడవరం లో సబ్ ఇన్స్పెక్టర్ -188, బి జోగారావు అవగాహన సమావేశాన్ని నిర్వహించాను.ఈ సమావేశంలో విద్యార్థులకు మహిళలపై జరుగుతున్న నేరాలు, మత్తు పదార్థాల నివారణ (యాంటీ డ్రగ్స్ ), పి ఓ సి ఎస్ ఓ చట్టం, కొత్త క్రిమినల్ చట్టాలు, రోడ్ సేఫ్టీ, సైబర్ నేరాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించి చర్చించారు.

## వైమనిక దళంలో ఉద్యగాల ఎంపిక లో సత్తా చాటిన వాగ్దేవి డిఫెన్స్ అకాడమి విద్యార్థులు



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస లో వాగ్దేవి డిఫెన్స్ అకాడమి విద్యార్థులు వైమనికదళం నిర్వహించిన ఉద్యగల ఎంపిక పరీక్షలో విజయం సాధించారు అని కళాశాల కరెస్పాండంట్ కోటిని మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు కలలు కనడం చాలా మందికి సాధ్యం కానీ ఆ కలలను నిజం చేయడం కొద్దిమందికే సాధ్యం అని వాగ్దేవి డిఫెన్స్ అకాడమీ లో శిక్షణ పొందిన విద్యార్థులు చేతన్ మరియు పవన్ భారత వైమానిక దళం లో ఉద్యోగానికి ఎంపికై తమ జీవితాల్లోనే కాదు, తమ కుటుంబాల జీవితాల్లో కూడా వెలుగులు నింపారు.అని అనేక ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొంటూ, అలసటను పక్కనపెట్టి, ప్రతిరోజూ దేశసేవే లక్ష్యంగా కష్టపడిన వారి ప్రయాణం చివరికి ఈ గర్వకారణమైన విజయంగా నిలిచింది.అని వారి కళ్లలో మెరిసిన ఆశలు, హృదయంలో నిండిన దేశభక్తి ఈ రోజు భారత వైమానిక దళం రూపంలో సాకారం అయ్యాయి. ఈ విజయానికి వెనుక వాగ్దేవి డిఫెన్స్ అకాడమీ అందించిన క్రమశిక్షణతో కూడిన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల్లా చూసుకునే యాజమాన్య సహకారం ప్రధాన బలంగా నిలిచాయి.అని విద్యార్థి విజయం అకాడమీ విజయం అనే భావనతో, ప్రతి అడుగులోనూ వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకుల కృషి ఈ ఫలితం సాధించారాని మా విద్యార్థులు ఇంకెన్నో సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూన్నాను అని ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్ , రాజ్ కుమార్ , సురేష్ ,లక్ష్మణ్ మరియు ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది సెలెక్ట్ అయిన విద్యార్థులు కి అభినందనలు తెలిపారు.

## మెగా ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం



**అరకులోయ, పతాకం న్యూస్:** ఆదివాసి గిరిజన సంఘం ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో, విశాఖపట్నం మెడికవర్ హాస్పి టల్ సౌజన్యంతో గుగ్గుడు గ్రా మంలో మెగా ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, కంటి సమస్యలు, చర్మ వ్యాధులు వంటి అనేక అనారోగ్య సమస్యలు సాధారణంగా కనిపిస్తున్నాయి. అధునాతన వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాడేరు మెడికల్ కళాశాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ఆదివాసీలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ క్యాంపు సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్యాంపులో ఉచిత డాక్టర్ కన్సల్టేషన్, ఈసీజీ, బ్లడ్ ప్రెషర్ చెకప్, జనరల్ మెడిసిన్ సేవలు అందించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయకుండా, ప్రభుత్వమే సమర్థవంతంగా నిర్వహించి గిరిజనులకు వైద్యం అందుబాటులోకి తెచ్చేలా కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఆదివాసీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ నుండి డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ భాగ్యరాజు (జనరల్ మెడిసిన్), డాక్టర్ రిషి (జనరల్ మెడిసిన్), పుష్పగిరి ఐ హాస్పిటల్ డాక్టర్ రాజు, నెల్లూరు వైద్య కళాశాల డాక్టర్ కామేశ్వరరావు, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ వి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు బురిడీ దశరథ్, నాయకులు కిండంగి రామారావు, పి. భీష్మ, పి. జయరాం ఇతరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇంధన పొదుపు పాటించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** ఇంధన పొదుపు ప్రగతికి మార్గమని కలెక్టరు ఎస్. రామసుందర్‌రెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీఈపీడీసీఎల్ నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ కలెక్టరేట్ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా విద్యుత్ పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆదాపై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్‌ను ఆదాచేసే ఐదు స్టార్ పరికరాలను వినియోగిం చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణరావు, ఈఈలు త్రినాథ్‌రావు, సురేష్‌బాబు, రఘు, ఏడీఈ కిరణ్‌కుమార్, డీఈలు, ఏఈలు, విద్యుత్ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనం



**పలాస, పతాకం న్యూస్:** మండలంలోని తర్లాకోట గ్రామ సచివాలయానికి అనుసంధానంగా ఏర్పాటుచేసిన విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాల భవనాలు నిరుపయోగంగా మారాయి. ప్రజల కు పంచాయతీస్థాయి నుంచే సేవలందించాలన్న ఆలోచనతో గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయల ప్రజాధనంతో ఈ భవనాలను నిర్మించా రు. ఇందులో కేవలం సచివాలయం భవనం మాత్రమే వినియోగిస్తున్నా రు. విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ను నిరుపయోగంగా విడిచిపెట్టారు. సచివాలయం భవ నానికి కూతవేటు దూరంలోఉన్న విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ను ఆయుష్మాన్ భారత్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌గా మార్చిన విషయం విదితమే. నిర్వహణలోపంతోపాటు పర్యవేక్షణ లేకపోవడంతో భవనంచుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు ఆ ప్రాంతమంతా దుర్గంధపూరితంగా మారింది. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగపడేలా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురా వాలని కోరుతున్నారు.కాగా ఎన్నికల సమయంలో హడావుడిగా భవనం ప్రారంభించినా బిల్లులు కాకపోవడంతో ఇప్పటికీ కాంట్రాక్టరు తమకు భవ నం అప్పజెప్పలేదని సమాచారం.

## ధనుర్మాస సందర్భంగా ఉత్తర ద్వారం దర్శనాలకు ఏర్పాట్లు



**గాజువాక, పతాకం న్యూస్:** గరుడాద్రి కొండపై వెలసిన శ్రీ భూ సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాసం సందరరేగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి హోమము భక్తులతో కలిసి ఆలయ కమిటీ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేత ృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎం భాస్కర ఆచార్యులు నిర్వహణలో అత్యంత వైభవంగా హోమము నిర్వహించారు . అర్చకులు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినాన కార్యక్రమాన్ని తెల్లవారుజామున నుండి సుప్రభాత సేవ ప్రారంభమవుతాయని ఉత్తర ద్వార దర్శనాలు ఉదయం 5:30 నుండి 11 గంటల వరకు మాత్రమే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందన్నారు. రాజగోపురం ద్వారా దర్శనం కోసం సుమారు పదివేల మంది భక్తులు విచ్చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు రామలక్ష్మి దంపతులు, పెంటకోట రాజు,గౌరుసు రామలక్ష్మి,శరగడం సావిత్రమ్మ, కాంతమ్మ, చిన్నమ్మలు, నాగమణి, పద్మ, చిట్టమ్మ, మంగమ్మ, ఉషారాణి, లక్ష్మమ్మ, స్వాతి, రాజులమ్మ మరియు ఆలయ కమిటీ సభ్యులు ఆలయ నిర్వాహకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వెలిగల్లు ప్రాజెక్టు మరమ్మతులకు రూ.36 కోట్లు



**రాయచోటి, పతాకం న్యూస్:** వెలిగల్లు ప్రాజెక్టు పూర్తయి సుమారు 16 సంవత్సరాలు అవుతోం ది. ఇప్పటికీ ఈ ప్రాజెక్టు ద్వారా నిర్దేశిత ఆ యకట్టుకు నీళ్లు అందడం లేదు. పిచ్చిమొక్క లు, మట్టి, రాళ్లతో కాలువలు పూడిపోవడం.. లైనింగ్ లేకపోవడంతో.. కాలువలకు వదిలిన నీళ్లలో ఎక్కువగా ఇంకిపోవడం.. బయటకు వెళ్లిపోతున్నాయి. తద్వారా వెలిగల్లు కుడికాలు వకు ఆయకట్టు నీళ్లు అందడం లేదు. ఎప్పుడో ఐదారేళ్లకు ఒకసారి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుతున్నా.. రైతులకు ఉపయోగం ఉండడం లేదు. దీంతో కుడికాలువ ఆయకట్టు చివరి వ రకు నీళ్లించేందుకు.. కాలువ మరమతుల కో సం రూ.36 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కుడికాలువ రైతుల సమస్య తీరినట్టే. రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండల పరిధిలో పాపాఘ్ని నదిపైన వెలిగల్లు వద్ద వెలిగల్లు ప్రాజెక్టును నిర్మించారు. ఎడమ కాలువ కింద 500 ఎకరాలు, కుడి కాలువ కింద 21,400 ఎకరాలు ఆయకట్టుగా నిర్ణయించి ఈ ప్రాజెక్టును సుమారు రూ.200 కోట్లతో నిర్మిం చారు. 2009 ఎన్నికలకు ముందు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. కాలువల నిర్మాణానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్‌ఆర్ కంపెనీ సుమారు రూ.9కోట్లకు టెండర్లు దక్కించుకుం ది. అయితే ఈ కాలువలకు అనుబంధంగా పిల్ల కాలువలు పూర్తి చేయకుండానే.. మొత్తం బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తా యి. ప్రధాన కాలువకు పలుచోట్ల గండ్లు పడడం.. పిచ్చిమొక్కలు, రాళ్లతో కాలువలు పూడిపోవడం, పిల్ల కాలువలు లేకపోవడంతో.. ప్రాజెక్టు పూర్తయి.. 16 ఏళ్లయినా.. ఇప్పటి వరకు చివరి ఆయకట్టుకు నీళ్లు అందింది లేదు. ఈ పదహారేళ్లలో మూడు పర్యాయాలు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. దీంతో ప్రాజెక్టులో నీళ్లున్నా.. రైతుల పొలాలకు అందలేదనే అసంతృప్తి వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ ఆయకట్టుదారుల్లో ఉంది.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల పొట్టకొట్టొద్దు: సిఐటియు గనిశెట్టి డిమాండ్




**పరవాడ, పతాకం న్యూస్:** ఎన్నో పోరాటాల ఫలితంగా, దేశంలో రెక్కాడితే గాని డొక్కాడని పేదల కోసం, గ్రామీణ ప్రాంత నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ కూలీలకు కనీస ఉపాదిని గ్యారెంటీ చేయడానికి 2005లో వామపక్షాల ఉద్యమంతో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని ఒక సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలందరూ ప్రతిఘటించాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు . నేటి వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని గని శెట్టి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పరవాడలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు, పేరు మార్చడానికి మాత్రమే ఉద్దేశించింది కాదు. పూజ్యభాపు గ్రామీణ రోజ్ మర్ యోజన పేరుతో చేసిన సవరణ చాలా ప్రమాదకరమైంది. ఉద్దేశపూర్వకంగా మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాకుండా దీని ప్రకారం చట్టం కాస్త పథకంగా మారుతుంది. పథకం అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది గని శెట్టి అన్నారు . ఇప్పటి వరకు గ్రామీణ పేదలు అనుభవిస్తున్న ఉపాదిహామీ చట్టం కల్పించిన హక్కు రద్దవుతుంది. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిలయత్నాలను ఉపాధి హామీ కార్మికులు వ్యతిరేకించాలని గనిశెట్టి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే పోతి నాయుడు, ముత్యాలు, చిరంజీవి, రామ్ నాయుడు, వెంక నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలి’



**ఆదోని, పతాకం న్యూస్:** ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఈరమ్మ, రంగమ్మ, హుస్సెన్‌బీ, ఎలీషమ్మ డిమాండ్ చేశారు. ఆదోని జిల్లా సాధన జేఏసీ గౌరవ అధ్యక్షులు కమలే గణేష్, ఆదోని జిల్లా సాధన విద్యార్థి జేఏసీ నాయకులు శేఖర్ ఉదయ్ చేపట్టిన 6వ రోజు రిలే నిరాహాక దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్షకు మహిళా సంఘాలు, కాశీంబీ, ఈరమ్మ మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు రఘు, శేఖర్, ఉదయ్, కృష్ణ, ఖాజా, ఆఫ్రీది, బతకన్న పాల్గొన్నారు. ఆదోని జిల్లా చేసేంతవరకు పోరాడతామని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆదోని జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ రామతీర్థం అమ్రేష్ అన్నారు. మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు బీఎస్ఎస్, బీఎస్పీ, బుడగజంగాల, మాలమహానాడు సంయుక్త ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్‌లో భారీ ఎత్తున మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వేదికపై నాలుగో రోజు జాలవాడి, కంబలదిన్నె నాయకులు రత్నం, చిన్నమహాదేవ్, రాము, లక్ష్మన్న, బజారితో పాటు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, బుడగజంగాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు సామేల్, రాష్ట్ర కన్వీనర్ బోయ రవికుమార్, యాకోబ్, సుధాకర్, మఠ్రిస్వామితో పాటు 25 మంది రిలే నిరహార దీక్షల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో ప్రసన్న, భీమన్న, రాజు, మాలమహనాడు జిల్లా కన్వీనర్ ఉసేని, యోబు, ప్రభదాస్, కుమార్, రాజు, దేవదాసు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు




**అమరావతి, పతాకం న్యూస్:** పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఆధార్ స్పెషల్ క్యాంపులను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పేర్కొంది. ఈ మేరకు ఆ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబరులో నిర్వహించిన క్యాంపులు కొనసాగింపుగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు, 22 నుంచి 24వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ మిగిలి ఉన్నవారు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ శాఖ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 16,51,271 మంది విద్యార్థులుండగా, గత క్యాంపులో 3,34,599 మంది విద్యార్థులు ఆధార్ నమోదు చేసుకోగా, నమోదు చేసుకోవాల్సిన వారు 13,16,672 మంది ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

## పలాస రైల్వేస్టేషన్ ఆధునికీకరణ



**పలాస, పతాకం న్యూస్:** పలాస రైల్వేస్టేషన్‌ను అమృతభారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆధునీకరిస్తున్నారు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫారాన్ని టిక్కెట్ రిజర్వేషన్ కార్యాలయం ఉండే ప్రాంతానికి మార్చేపనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న నాలుగు ప్లాట్‌ఫారాలను కలుపుతూ పది మీటర్ల వెడల్పుతో భారీ ఫుట్‌బ్రిడ్జిని నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. రెండేళ్ల కిందట పలాస రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించేందుకు రూ.24.50 కోట్లు కేంద్ర రైల్వేశాఖ మంజూరు చేసిన విషయం విదితమే. దీంతో పాటుగా అదనంగా మరో 15 కోట్లు జోనల్‌వర్క్సుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఫ్లాట్‌ఫారాన్ని మార్పిడి చేస్తు కొత్తగా దీన్నికిలోమీటరు పొడవునా నిర్మిస్తున్నారు. కాశీబుగ్గ ఎల్‌సీ గేటు నుంచి తాళభద్ర ఎల్‌సీ గేటుకు సమీపం వరకూ ప్లాట్‌ఫ్లారం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత పనులు 20 శాతం మేరకుజరిగాయి. బ్రిడ్జి పనులుకూడా రెండునెలల నుంచి ప్రారంభించారు.ఇప్పటికే ఐరన్ పిల్లర్స్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. రెండువైపులా పునాదులు నిర్మించారు.కిలోమీటరు పొడవునా ఉన ్న ప్లాట్‌ఫారాలపై రూఫింగ్‌లు వేస్తున్నారు. ఈ ప్రాంతంలో షాపింగ్‌మాల్స్ కూడా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ ఆలోచిస్తోంది.

## రోలుగుంట పీహెచ్‌సీలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభోత్సవం

**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం పిహెచ్సి పరిధిలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతులమీదుగా ప్రారంభం చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ యొక్క భవనానికి & వెల్ఫేర్ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఏపీ ఈ డబ్ల్యూడిసి ద్వారా ఈ భవనం నిర్మించ బడిందని జరిగిందని తెలిపారు. వైద్యాధికారి శ్రావణి మాట్లాడుతూ ఈ యొక్క భవనం నుంచి వ్యాధి పర్యవేక్షణ అంటువ్యాధి నిర్మూలన, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, తాగునీటి పరిశుభ్రత, పోషక ఆహార ప్రోత్సాహం వంటి పనులు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ నాగమ్మ, మండల టిడిపి అధ్యక్షులు పరచాడ చంద్ర, రోలుగుంట ఎంపీటీసీ రామకృష్ణ, గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, మండల తెలుగుదేశం నాయకులు, రోలుగుంట పిహెచ్సి వైద్య సిబ్బంది, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# భీమసింగి చక్కెర కర్మాగారం మూసేసి ఐదేళ్లయింది!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భీమసింగి చక్కెర కర్మాగారం పరిధిలోని రైతుల్లో అత్యధిక శాతం మంది చెరకు సాగును వదిలేశారు. కొంతమంది రైతులు సాగు తగ్గించారు. దీంతో లక్ష టన్నుల ఉత్పత్తి నుంచి ఐదు వేల టన్నుల ఉత్పత్తికి పడిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత ఆధునికీకరణ పేరిట ఈ పరిశ్రమను మూసేసిన సంగతి తెలి సిందే. అప్పటి నుంచి ఈ కర్యాగారం పరిధిలో పండిస్తున్న చెరకు ను సంకలి కర్మాగారానికి తరలిస్తున్నారు. ఇది చాలా దూరంలో ఉండడంతో రైతులకు వ్యయప్రయాసలుగా మారింది. భీమసింగి కర్మాగారం మూతబడే సమయానికి 51,759 టన్నులు సంకిలికి తరలించాల్సి రావడం తో.. ఆమరుసటి ఏడా దే సాగు సగానికి సగం తగ్గిపోయిం ది. అప్పటి నుం చి తగ్గుతూ వచ్చింది. గత ఏడాది కేవలం 9వేల టన్నుల సరఫరా జరిగింది. ఈ సీజన్‌లో 5 వేల టన్నులు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో మద్దతు ధర ప్రకటించకుండానే చెరకు తరలింపునకు చర్యలు తీసుకోవడంతో రైతుల్లో ఆందోళన కనిపి స్తోంది. దీనికితోడు గత ఏడాది సంకిలి కర్మాగారం యాజమాన్యం రవాణా చార్జీలు మిన హా టన్నుకు రూ.2,800 ధర చెల్లిస్తామని చెప్పింది. కానీ రూ.2,725 చేతిలో పెట్టింది. టన్నుకు రూ.75 కోత పెట్టడంతో రైతులు మరింత నష్టపోయారు. ఈ బకాయిలను ఇవ్వాలని రైతులు ఒత్తిడి తెచ్చినా ఫలితం లేదు. ఈ ఏడాది ఎంత ధర ఇస్తారో కూడా తెలియదు. భీమసింగి కర్మాగార పరిధి రైతులు శుక్రవారం నుంచి చెరకును తరలించేందుకు అధికారులు పూనుకున్నారు. భీమసింగి కర్మాగారం పరిధిలో రైతులు గతంలో తమకు ఉన్న భూమిలో కొంత చెరకు, మరికొంత వరి పండించేవారు. ఒక పంటలో నష్టం వచ్చిన మరో పంటలో దీన్ని భర్తీ చేసుకునేవారు. ఒక్కో ఏడాది రెండు పంటల్లోను లాభాలు వచ్చేవి. కర్మాగారం మూసివేయడంతో చాలామంది రైతులు చెరకు సాగును తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం చేశారు. ఇప్పుడు పూర్తిగా వరి పంటవైపు మళ్లారు. ఈ పంట పెట్టుబడులకే సరిపోతుంది. పోనీ సంకిలి కర్మాగారానికి తరలించినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. భీమసింగి చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపిస్తే బాగుటుందన్న ఆశ ఇటు రైతుల్లోను, ఆటు కార్మికుల్లోను ఉంది. ఈ కార్యాగారం మూసేసిన సమయంలో కార్మికుల జీతాలు, పీఎఫ్‌లను చెల్లించలేదు. వాటి కోసం ఇప్పటికి కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై ఈ ఏడాది శాసనసభ సమావేశాల్లో శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి ప్రస్తావించారు. ఈ కర్మాగారం గజపతినగరం నియోజకవర్గ పరిధిలో ఉంది. ఈ నియోజకవర్గం శాసనసభ్యుడిగా ఉన్న కె.శ్రీనివాస్ ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇదే శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపల్లి ఈ కర్మాగారంను ఎంఎస్ఎంఈ జాబితాలోకి తీసుకుని వచ్చి న్యాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు. 1973లో నుంచి ఉన్న ఈ కర్మాగారం 1.90లక్షల టన్నుల చెరకు గానుగ చేసిన చరిత్ర ఉంది. కర్మాగారానికి విజయనగరం జిల్లాలోని భోగాపురం, బొండపల్లి, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గుర్ల, జామి, కొత్తవలస, లక్కవరపుకోట, నెల్లిమర్ల, పూసపాటి రేగ, ఎస్.కోట, వేపాడ, విజయనగరం మండలాలతో పాటు విశాఖపట్నం జిల్లా అనందపురం, పద్మనాభం, భీమినిపట్నం, కె.కోటపాడు మండలాలతో కలుపుకుని 18 మండలాలకు చెందిన రైతులు చెరకును సరఫరా చేసేవారు.

ప్రతి ఏటా డిసెంబరు నెల నుంచి జనవరి నెలాఖరు వరకు జామి మండలం అలమండ, ఎస్.కోట, ఈ మండల పరిధిలోని పోతనాపల్లి, ఎల్.కోట, గంట్యాడ మండలం కోర్లాం, గజపతినగరం, పూసపాటి రేగ మండలం నాతవలస, పద్మనాభం మండలం శిర్లపాలెం కాటాల వద్ద చెరకుతో ఎండ్ల బండ్లు సందడి చేసేవి. ఈ కర్మాగార చైర్మన్ ఎన్నికలు జిల్లా ప్రాథమిక సహకార సంఘం (డీసీసీబీ) ఎన్నికకంటే ప్రతిష్టాత్మకంగా జరిగేవి. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు తమ పార్టీకి చెందిన వ్యక్తిని ఈ సీట్లో కూర్చోబెట్టేందుకు రైతుల ఇళ్లకు పరుగు పెట్టేవారు. ఇంతటి ఘన చరిత్ర వున్న ఈ కర్మాగారం కాలక్రమంలో మసకబారింది. బెల్లం తయారీలో ఎక్కువ లాభాలు రావడంతో రైతులు కర్మాగారానికి చెరకు సరఫరా తగ్గించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చక్కెరకు గిరాకీ తగ్గడం కూడా ఈ కర్మాగారంపై ప్రభావం చూపింది. సహకార వవ్యవస్థలో నడిచే ఏకైక కర్మాగారాన్ని కాపాడేందుకు నేతలు చొరవ చూపలేదు. లాభ నష్టాల మధ్య ఊగిసలాడుతున్న దీన్ని 2020-2021 సీజన్‌లో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఆధునీకరిస్తామని చెప్పిన వైసీపీ సర్కారు ఐదేళ్లలో రూపాయి కూడా కేటాయించలేదు. మూసేసిన ఒకట్రెండు సంవత్సరాల తరువాత కార్మికులు, రైతులు కర్మాగారాన్ని తెరిపించేందుకు రూ.5కోట్లు కేటాయించాలని విన్నవించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ఈ ప్రాంతానికి ప్రభుత్వ పెద్దలు ఎవరు వచ్చినా గుర్తు చేసేవారు. ఇప్పుడు అంచనా వ్యయం పెరిగింది. కనీసం రూ.15 కోట్లు అందిస్తే తప్ప అధునీకీకరణ జరిగే అవకాశం లేదు.

# అంతర్జాతీయ మార్కెట్‌లో శరవేగంగా రూపాయి పతనం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి పతనం శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా మరింత అగాథంలోకి పడిపోయింది. సోమవారం నాటి గణాంకాల ప్రకారం డాలర్‌తో మారకం విలువ ఒకేరోజు 25పైసలు పతనమైంది. ఒక డాలర్‌కు 90.74 రూపాయలకు పడిపోయింది. రూపాయి విలువ పతనంలో ఇదో రికార్డు. భారతదేశ చరిత్రలో ఇంత కనిష్ట విలువతో రూపాయి ఎప్పుడూ లేదు. తాజా పతనంతో ఆసియాలోనే అత్యంత పేలవ కరెన్సీగా రూపాయి నమోదైంది. ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ కొంతకాలంగా క్షీణిస్తున్న సంగతి తెలిసిందే. దీనిని సరిదిద్దడానికి చర్యలు చేపట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశలో స్పందించడం లేదు. పైగా మన దేశం నుండి జరిగే ఎగుమతులకు రూపాయి పతనం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అదే సమయంలో పెద్దఎత్తున చేసుకుంటున్న చమురు దిగుమతులు తద్వారా పెరుగుతున్న ఆహార దినుసులు దేశంలో ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గిస్తున్న విషయాన్ని మరుగుపరుస్తున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మెరుగుదల లేకపోవడంతో రూపాయి పతనం ప్రభావం సామాన్యులపై నేరుగా పడుతోంది. అమెరికా -భారత్ మధ్య వాణిజ్య చర్చలు కొలిక్కిరాకపోవడం, విదేశీ పెట్టుబడిదారుల భారీ ఉపసంహరణలు, వాణిజ్యలోటు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరగడం వంటివి కూడా రూపాయి పతనానికి కారణాలుగా చెబుతున్నారు. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో డాలర్‌తో రూపాయి 90.53 వద్ద తెరుచుకుంది. ఇంట్రాడేలో 31 పైసలు పతనమై ఏకంగా 90.80 కనిష్టాన్ని చవిచూసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 0.3 శాతం లేదా 25 పైసలు కోల్పోయి రూ.90.74కి క్షీణించింది. ఇది డిసెంబర్ 12న నమోదైన గత రికార్డు కనిష్టం రూ.90.55ను దాటడం గమనార్హం. నెలరోజుల్లో రూపాయి విలువ దాదాపుగా 80 పైసలు పతనమైంది. నవంబర్ 15వ తేదిన డాలర్‌కు 89.90 రూపాయలుగా నమోదుకాగా, నవంబర్ 25న 90.10గా, డిసెంబర్10న 90.53గా డిసెంబర్ 15న 90.74 రూపాయలుగా భారత కరెన్సీ విలువ పడిపోయింది,. ఈ ఏడాది ఇప్పటి వరకు రూపాయి.. డాలర్‌తో పోలిస్తే దాదాపు ఆరు శాతం క్షీణించింది. ఆసియా కరెన్సీల్లో అత్యంత దారుణ ప్రదర్శన కనబర్చిన కరెన్సీగా రూపాయి ఉండటం గమనార్హం. డాలర్ సూచీ ఈనెలలో ఇప్పటి వరకు 1.1 శాతం పడిపోయినా.. రూపాయి మాత్రం ఈ ప్రయోజనాన్ని పొందలేకపోయింది. అమెరికా.. భారత్‌పై విధించిన 50 శాతం వరకు ఉన్న భారీ టారిఫ్‌లు ఎగుమతులను దెబ్బతీయడం, విదేశీ పెట్టుబడిదారులకు భారత మార్కెట్ ఆకర్షణ తగ్గడమే ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడిదారులు 18 బిలియన్ డాలర్లకు పైగా విలువైన భారత షేర్లను విక్రయించారు. ఒక్క డిసెంబర్‌లోనే 500 మిలియన్ డాలర్లకు పైగా విలువ గల బాండ్లను అమ్మారు. నవంబర్‌లో సరుకుల వాణిజ్య లోటు 32 బిలియన్ డాలర్లుగా అంచనా ఉంది. అయితే ఇది అక్టోబర్‌లో నమోదైన 41 బిలియన్ డాలర్లతో పోలిస్తే కొంత తగ్గే అవకాశం కనిపిస్తోంది.

భారత ప్రధాన ఆర్థిక సలహాదారు చేసిన వ్యాఖ్యలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. అమెరికా వాణిజ్య ఒప్పందం మార్చి నాటికి మాత్రమే సాధ్యమవుతుందని ఆయన చెప్పడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన పెరిగింది. ఇక ఇదే సమయంలో భారత్ – యూరోపియన్ యూనియన్ (ఇయు) వాణిజ్య ఒప్పందం



కూడా ఈ ఏడాది చివరి నాటికి పూర్తయ్యే అవకాశాలు లేవని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ శుక్రవారం నివేదించింది.

”వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో విదేశీ నిధుల ఉపసంహరణలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచుతోంది” అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ పేర్కొన్నారు. రూపాయికి తదుపరి రూ.90.80కి పడిపోవచ్చన్నారు. అది దాటితే రూ.91 నుంచి రూ.92 దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈనెల 5 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 687.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సెప్టెంబర్ ప్రారంభంలో నమోదైన ఈ ఏడాది గరిష్ట స్థాయి 703 బిలియన్ డాలర్ల కంటే తక్కువ కావటం గమనార్హం.మినహా వాస్తవంగా అణచివేయలేదని పేర్కొన్నారు. ఉగ్రదాడులు జరుగుతాయనే సమాచారంతో తనిఖీలు చేస్తున్న కేంద్రం ముందుగానే వాటిని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ఇలాంటి సమయాల్లో మతాన్ని టార్గెట్ చేసుకుని ప్రచారం చేయడం వల్ల వైషమ్యాలు పెరుగుతున్నాయి మినహా ఉగ్రవాదం తగ్గదని చెప్పారు.. ఇప్పటికైనా కేంద్రం స్పందించి అఖిలపక్షం ఏర్పాటు చేసి ఉగ్రవాద నివారణకు అవసరమైన సలహాలు సూచనలు తీసుకుని వాటిని అమలు చేయాలని కోరారు.మొంథా తుఫానులో నష్టపోయిన రైతులకు పరిహారం ఎగ్గొట్టేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని తొలుత చెప్పిన ప్రభుత్వం ఎన్యుమరేషన్లో తగ్గించుకుంటూ వస్తోందని అన్నారు. వరి, అరటి, మొక్కజన్న, పసుపు వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో రైతుల సంఖ్యను తగ్గిస్తున్నారని తెలిపారు. గతంలో ఉచిత పంటల బీమా వల్ల రైతులకు ఉపయోగం కలిగందని, ప్రస్తుతం అది లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే సిసిఏ అనుసరిస్తున్న విధానం వల్ల పత్తిరైతులకు అన్యాయం జరుగుతోందని, నిబంధనలు మార్చాలని డిమాండు చేశారు. మొక్కజన్న రైతులను ఆదుకోవాలని కోరారు. పంటలు దెబ్బతిన్న రైతులు, కౌలు రైతులు అందరినీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆహారాన్ని ఉడికిస్తున్నారా? ఫ్రై చేస్తున్నారా?

## ఆరోగ్యానికి ఏది మంచిదంటే!

ఉప్పూకారం దట్టించి, భగభగలాడే నూనెలో వేయించి, కణకణమండే నిప్పులపై కాల్చేసి తయారుచేసిన ఆహారమంటే తెగ ఇష్టపడతారు చాలామంది. నార్మల్‌గా కుక్ చేసుకుని ఆరగిస్తుంటారు మరికొందరు. స్టీమింగ్, బేకింగ్ అంటారు ఇంకొందరు. మరి, ఇందులో ఏ పద్ధతి మంచిది? దీనిపై సీనియర్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ లతాశశి కీలక సూచనలు చేస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు చూద్దాం. ఇది సాధారణ వంట పద్ధతి. ఆరోగ్యానికి మంచిది కూడా. ఈ పద్ధతిలో పప్పులు, బియ్యం, కూరగాయలు,.. ఇలా ఏది వండినా నూనె వినియోగం శూన్యంగా లేదా తక్కువగా అవసరమవుతాయని ఆమె చెబుతున్నారు. ఈ పక్రియలో పోషకాలు కూడా 90 శాతం వరకు నిల్వ ఉండటంతో పాటు సులభంగా జీర్ణమవుతాయని అంటున్నారు. ఈ క్రమంలో ఉడకబెట్టిన ఆహారాలు.. జీర్ణశక్తి మెరుగుపర్చటంతోపాటు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్నీ తగ్గిస్తాయని పేర్కొంటున్నారు. కానీ, ఎక్కువమంది ఉడకబెట్టిన తర్వాత నీళ్లను పారబోస్తారని, దీనివల్ల పోషకాలు వెళ్లిపోతాయని తెలియజేస్తున్నారు. ఎంత నీరు అవసరమో, అంతే నీటితో ఉడకబెట్టుకోవడం మేలని సూచిస్తున్నారు. 15 నిమిషాలు ఉడకబెట్టడం వల్ల యాంటీన్యూట్రియెంట్స్ గణనీయంగా తగ్గడం ద్వారా ఇన్ విట్రో ప్రోటీన్ జీర్ణశక్తి మెరుగుపడుతుందని అధ్యయనం కూడా పేర్కొంది. ఆధునిక భారతీయ వంటగదుల్లో దీనికి చాలా ప్రాధాన్యముంది. ఇడ్లీ, ఢోక్లా వంటి సంప్రదాయ వంటకాలతో పాటు క్యారెట్, బ్రకోలీ, ఫిష్ వంటి పదార్థాలనూ ఆవిరిపై వండుతున్నారు. ఈ ప్రక్రియ వల్ల పోషకాల నష్టం తక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ పద్ధతి డయాబెటిస్ పేషెంట్స్‌కు



మంచిదని, నూనె వాడకుండా వండొచ్చని తెలియజేస్తున్నారు. కానీ, ఈ విధానంలో విటమిన్ సి, కె, మినరల్స్ ఎక్కువగా నిల్వ ఉంటాయని వెల్లడిస్తున్నారు.

భారతీయ కుటుంబాల్లో ఎక్కువ మంది సాధారణంగా ఉపయోగించే వంట విధానంలో ఒకటి. తక్కువ సమయంలో వంట పూర్తవడంతోపాటు ఇంధనం కూడా ఆదా అవుతుందంటున్నారు నిపుణులు. అలాగే పోషకాలు కూడా అందుతాయని చెబుతున్నారు. కానీ, చాలా ఎక్కువగా ఉడకబెడితే పోషకాల నష్టం కూడా అదే స్థాయిలో ఉంటుందని తెలియజేస్తున్నారు.

గ్రిల్లింగ్ అండ్ రోస్టింగ్, ఎయిర్ ఫ్రయర్ వంటి విధానాల వల్ల నూనె వాడకం తక్కువగా ఉంటుంది. తద్వారా కొవ్వు మోతాదు తగ్గుతుంది. కానీ, ఈ విధానాల్లో ఆహారాన్ని వారంలో ఎన్నిసార్లు? ఎంత మోతాదులో తింటున్నారనేది చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. తరచూ ఎక్కువ మోతాదులో.. ఈ విధానాల్లో వంట చేసుకొని తినడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు. ఎలాగంటే, అప్పడాలను నూనెలో వేయించకుండా రోస్ట్ చేసి తినొచ్చు.. కానీ, వీటిల్లో ఉండే ఉప్పు మోతాదు తగ్గదు కదా! అందుకని ఎలా వండినా తక్కువ మోతాదులో తినడమే మేలని సూచిస్తున్నారు

ఈ పద్ధతి కూడా భారతీయుల ప్రత్యేక వంట. ఆవాలు, వెల్లుల్లి, కరివేపాకు, జీలకర్ర, అల్లం వాడే ఈ తాలింపు పద్ధతి భారతీయులకు ప్రత్యేకం. ఇలా వండడం వల్ల రుచి పెరగడంతోపాటు తక్కువ నూనెతో చేయవచ్చంటున్నారు నిపుణులు. అంతేకాకుండా, ఇలా చేస్తే ఆరోగ్యకరమైన ఫైటోకెమికల్స్ సొంతమవుతాయని చెబుతున్నారు.

ప్రస్తుతం నగరాల్లో గ్రిల్లింగ్ అండ్ రోస్టింగ్ ట్రెండ్ పెరుగుతోంది. గ్రిల్ చేయడం ఇప్పుడు చాలామంది ఇష్టపడుతున్నారు. ఈ విధానంలో కూరగాయలు, పనీర్, చికెన్, ఫిష్ తక్కువ కొవ్వుతో రుచికరంగా తినొచ్చంటున్నారు నిపుణులు. ఈ పద్ధతి వల్ల అధిక కొవ్వు బయటకు వస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా, రుచితోపాటు తేలికైన ఆహారం తీసుకోవచ్చని సూచిస్తున్నారు. కానీ, ఈ విధానంలో రోజూ వండే ఆహారం మితంగానే తినడం మేలంటున్నారు. అలాగే, బొగ్గు మీద గ్రిల్ చేస్తే కార్సినోజెన్స్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఈ పద్ధతిలో తక్కువ నూనెను వినియోగిస్తారు. కట్‌లెట్లు, ఫిష్, బ్రెడ్ టోస్ట్ వంటి వాటికోసం ఈ విధానాన్ని వాడొచ్చంటున్నారు నిపుణులు. నూనెను తక్కువగా వినియోగించడం వల్ల ఆరోగ్యానికి మంచిదని సూచిస్తున్నారు. ఈ పద్ధతిలో వంట తొందరగా పూర్తి అవుతుందని చెబుతున్నారు. ఆలివ్, రైస్? బ్రాన్ ఆయిల్ వంటి నూనెలతో షాలో ఫ్రై చేస్తే ఆరోగ్యానికి మంచిదని పేర్కొంటున్నారు. కానీ, ఈ విధానాన్ని కూడా తరచూ వినియోగించొద్దని తెలియజేస్తున్నారు.

ఇది నాన్‌ఫ్రైడ్ స్నాక్స్‌కు ప్రత్యామ్నాయం. కుకీస్, కేక్ మాత్రమే కాదు.. ఇప్పుడు బేక్డ్ కట్లెట్, బేక్డ్ సమోసా, బేక్డ్ పనీర్ టిక్కా వంటి ఆరోగ్యకరమైన వంటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ పద్ధతిలో నూనె లేకుండా లేదా చాలా తక్కువ నూనెతో వంట పూర్తవుతుందంటున్నారు నిపుణులు. బేకింగ్ వంటలు ప్రాసెస్డ్ ఫుడ్ కంటే ఆరోగ్యకరమని చెబుతున్నారు. అయితే, ఎంత తక్కువ సమయంలో, ఎంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండుకున్నామనేది చాలా ముఖ్యమంటున్నారు.

# సబ్జా గింజలు అందానికీ మంచివట!



యవ్వనంగా కనిపించాలని, అందంగా మెరిసిపోవాలని అమ్మాయిలు ఆరాటపడుతుంటారు?. ఈ క్రమంలో కొంతమంది ఇంట్లో లభించే పదార్థాలతో ఫేస్ ప్యాక్?లు తయారు చేసుకుంటారు. మరికొందరు బ్యూటీ పార్లర్లకు వెళుతుంటారు. అయితే, పార్లర్?కు వెళ్లే పని లేకుండా సహజంగానే అందాన్ని పెంపొందించుకోవాలంటే సబ్జా గింజలను ఆహారంలో భాగం చేసుకోవాలంటున్నారు సౌందర్య నిపుణులు. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగానే కాదు, సౌందర్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! పర్యావరణ కాలుష్యం కారణంగా, చర్మం కాంతిని కోల్పోతుంది. దుమ్ము, ధూళి ప్రభావం వల్ల చర్మంపై మొటిమలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయాలంటే సబ్జా గింజలు అందుకు సరైన ఎంపికని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉండే సహజ డీటాక్స్ గుణాలు చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటకు పంపిస్తాయని అంటున్నారు. దీనివల్ల సౌందర్య సమస్యలు తగ్గి చర్మం మెరుపును సంతరించుకుంటుందని పేర్కొంటున్నారు. కొంతమందిలో చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు ఇబ్బంది పెడుతుంటాయి. అలాంటి వారు క్రమం తప్పకుండా సబ్జా గింజలను ఆహారంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులోని యాంటీ బయోటిక్, యాంటీ ఫంగల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చర్మ ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడుతాయని ప్రచురించింది.

కొంతమందికి చిన్నవయస్సులో చర్మం ముడతలు పడుతుంటుంది. అయితే ఇలా కనిపించకుండా ఉండటం కోసం చాలా మంది యాంటీ ఏజింగ్ క్రీమ్? లాంటివి వాడుతుంటారు. కానీ ఈ సమస్యకు సబ్జా గింజలు మేలంటున్నారు నిపుణులు. వీటితో తయారు చేసిన ఫేస్‌ప్యాక్ వేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో చెంచా కొబ్బరి నూనెలో సరిపడినంత సబ్జా గింజల పొడిని కలిపి, ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే సరిపోతుందని తెలియజేస్తున్నారు. సబ్జా గింజలు చర్మానికే కాదు జుట్టుకు కూడా మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. దీనిలో ఉండే విటమిన్ 'కె', బీటా కెరోటిన్, ప్రొటీన్లు అనేవి వెంట్రుకలు, కుదుళ్లు దృఢంగా మారేలా చేస్తాయంటున్నారు. అలాగే ఇవి కురులకు పోషణను అందించి పట్టులా, మృదువుగా మారేలా చేస్తాయని తెలియజేస్తున్నారు. సబ్జా గింజలను రోజూ ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు రాలే సమస్య నుంచి కూడా విముక్తి పొందచ్చని సలహా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సబ్జా గింజలు సహజసిద్ధమైనవే అయినా కొంతమందికి పడకపోవచ్చని, అందువల్ల ఒకసారి వాడి చూసి ఎలాంటి సమస్యలూ లేవనుకున్నప్పుడే కొనసాగించడం మంచిదని సూచిస్తున్నారు.

# కైలాసగిరిపై రెస్టారెంట్లకు అనుమతి

## పర్యావరణవేత్తల ఆందోళన



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం టూరిజం రంగానికి పెద్దపీట వేస్తోంది. రాష్ట్రంలో పెద్దఎత్తున పర్యాటక ప్రాజెక్టులు చేపడుతోంది. పర్యాటక వనరులైన సముద్ర తీరాలు, అటవీ ప్రాంతం, కొండ ప్రాంతాలు, నదీ తీరాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాల దగ్గర నుంచీ పురాతమైన కట్టడాల వరకు సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వింతలున్న ప్రాంతాలతో పాటు వేర్వేరు చోట్ల విభిన్నమైన వాటికి మరింత గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలోనే విశాఖ పర్యాటకంలో కైలాసగిరి కీలకపాత్ర పోషించేందుకు పొడవైన గాజు వంతెన నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా చేపట్టింది. పర్యాకులకు సరికొత్త అనుభూతి ఇచ్చే విధంగా దీన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కైలాసగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన గాజు వంతెన డిసెంబరు 1వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. మరోవైపు కైలాసగిరిపై భారం పడుతోంది. ఇప్పటికే 55కిపైగా దుకాణాలతో కిక్కిరిసిపోయింది. టాయ్ ట్రైన్, స్కై సైక్లింగ్, జిప్ లైనర్, గాజు వంతెనలు ఉన్నాయి. మరో వైపు సింగపూర్ సంస్థతో ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా కాటేజీలు, భారీ రెస్టారెంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఇలాంటి కట్టడాలను చేపట్టకూడదని గతంలో హైకోర్టు ఆదేశాలున్నాయి. దాంతో తీర ప్రాంత క్రమబద్ధీకరణ (సీఆర్‌జెడ్) నిబంధనలను అతిక్రమిస్తున్నారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై ఎకో హైట్స్ కాటేజీలు, 360 డిగ్రీల రివాల్వింగ్ ఫైన్ డైన్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్‌ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీన్ని ఓ వైఎస్సార్సీపీ నేతకు 33 ఏళ్ల లీజుకు కట్టబెట్టాలని చూశారు. కానీ ఈ ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. అప్పట్లో పిలిచిన టెండర్లను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు అదే ప్రాజెక్టును మళ్లీ పట్టాలపైకి తీసుకురావాలని నిర్ణయించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. నేచర్ కాటేజీలు 20 గదులను నిర్మిస్తారు. దీనికితోడు ఈత కొలను, సమావేశ మందిరం, పార్టీ హాలు, భోజనశాల సైతం ఉంటాయి.

ఒకేసారి వంద మంది కూర్చొని తినేలా రివాల్వింగ్ రెస్టారెంట్‌ను నిర్మిస్తారు. అంతేకాకుండా 60 మంది కూర్చునేలా బీచ్ వ్యూకేఫ్‌ను సైతం నిర్మిస్తారు. కైలాసగిరిపై భారీ ప్రాజెక్టులు చేపట్టడం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధమని అందుకే గతంలో హైకోర్టు కూడా తన తీర్పును వెలువరించింది. దీనికి సంబంధించి గతంలో ఇక్కడ నేచర్ కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ నిర్మాణాలను చేపట్టగా పర్యావరణవేత్తలు న్యాయస్థానంలో పోరాటం చేశారు. దాంతో వెంటనే నిర్మాణాలను ఆపేయాలని న్యాయస్థానం తక్షణం ఆదేశాలిచ్చింది. దీంతో ఆయా నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్త ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లడం గమనార్హం. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల పేరుతోన కైలాసగిరి కొండపై విధ్వంసానికి పాల్పడ్డారు. ఫలితంగా వందలాది వృక్షాలను తొలగించారు. ప్రాజెక్టు విస్తీర్ణం 1.99 ఎకరాలుగా ఉంది. అంచనా విలువ రూ.20 కోట్లు వరకూ ఉంది. నిర్మాణానికి సంబంధించిన గడువు 18 నెలలుగా అధికారులు నిర్దేశించారు. ఇదిలావుంటే కైలాసగిరిపై భారీ ప్రాజెక్టులు, రెస్టారెంట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వటంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇజ్రాయిల్ దాడిలో పాలస్తీనా భద్రతాధికారి మృతి



**గాజా:** గాజా స్ట్రిప్‌లో భద్రతాధికారి అహ్మద్ జామ్లామ్‌ను ఇజ్రాయిల్ కుట్రపూరితంగా హత్య చేసినట్లు హమాస్ నేతృత్వంలోని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. భద్రతాధికారి హత్యపై ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇజ్రాయిల్ నిఘా వర్గాలు ముందస్తుగా కుట్రపన్ని చేసిన హత్యగా ఈ దాడిని అభివర్ణించింది. దీంతో కాల్పుల విరమణ ఉల్లంఘనల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది.ఇజ్రాయిల్ నిఘా సంస్థల ప్రత్యక్ష పర్యవేక్షణ కింద పనిచేసే ఏజెంట్లు ఈ ఆపరేషన్‌ను నిర్వహించారని, ఇది ఉద్దేశపూర్వకంగా, ముందస్తుగా కుట్రపన్ని చేసిన హత్యగా ఆ ప్రకటనలో పేర్కొంది. అహ్మద్ జామ్లామ్ మృతదేహాన్ని అల్-అక్సా అమరవీరుల ఆస్పత్రికి తరలించినట్లు వైద్య వర్గాలు నిర్ధారించాయి. ఇజ్రాయిల్ ప్రభుత్వం రాజకీయ, భద్రతా ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం ద్వారా గాజాను అస్థిర పరిచే వ్యూహాన్ని అనుసరిస్తోందని పాలస్తీనా అధికారులు చేసిన ప్రకటనను అల్-మఘాజీలో జరిగిన ఈ ఘటన బలపరుస్తోంది. ఇజ్రాయిల్ డ్రోన్ దాడిలో హమాస్ సీనియర్ కమాండర్, సాయుధ విభాగ అధ్యక్షుడు రయీద్ సయీద్ సహా మరో నలుగురు మరణించిన ఒక రోజు తర్వాత ఈ హత్య జరిగింది.కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ.. ఇజ్రాయిల్ సైనిక దాడులు సుమారు ప్రతిరోజు కొనసాగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్టోబర్ 10 తర్వాత సుమారు 386మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.




# విరాట్ రికార్డును బ్రేక్ చేసిన తిలక్ వర్మ



భారత టీ20 స్టార్ ప్లేయర్ తిలక్ వర్మ సరి కొత్త రికార్డు సృష్టించాడు. ఇంటర్నేషనల్ టీ20 ఫార్మాట్ ఛేదనలో అత్యుత్తమ సగటుతొ పరుగులు సాధించిన ప్లేయర్ గా తిలక్ నిలిచాడు. దీంతొ ఇన్నాళ్లుగా టీమిండియా వెటరన్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేరిట ఉన్న ఈ ప్రపంచ రికార్డును ఈ తెలుగు కుర్రాడు బద్దలు కొట్టాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో వర్మ బాగా బిజీగా ఉన్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో తరచూ మార్పుల నేపథ్యంలో కటక్ వేదికగా తొలి టీ20లో నాలుగో స్థానంలో వచ్చిన తిలక్ వర్మ32 బంతుల్లో 26 పరుగులు చేశాడు. ఇక ముల్లన్‌పూర్‌లో జరిగిన రెండో టీ20లోనూ ఇదే స్థానంలో ఆడిన ఈ హైదరాబాదీ కుర్రాడు.. దుమ్ములేపాడు. కేవలం 34 బంతుల్లోనే 62 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో వర్మ పోరాటం వృథాగా పోయింది. భారత్ ఓటమి పాలైంది. తాజాగా ఆదివారం ధర్మశాల వేదికగా జరిగిన మూడో టీ20లో మాత్రం తిలక్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా విధించిన 118 పరుగుల టార్గెట్‌ను భారత్15.5 ఓవర్లలోనే పూర్తి చేసింది. తిలక్ వర్మ 34 బంతుల్లో 25 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు. జట్టు గెలుపులో తన వంతు పాత్ర పోషించాడు. ఈ క్రమంలోనే ఈ తెలుగు కుర్రాడు అరుదైన ఘనత సాధించాడు. ఇంటర్నేషనల్ టీ20 టోర్నీలో లక్ష్య ఛేదనలో టెస్టు హోదా కలిగిన దేశాల్లో కనీసం 500 పరుగులు సాధించిన ప్లేయర్ల జాబితాలో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు.

# రికార్డు స్థాయిలో రూ. 25.20 కోట్లకు అమ్ముడైన కామెరాన్ గ్రీన్



"ఈ ఏడాది ఐపీఎల్‌లో కోల్‌కతా జట్టులో భాగమైనందుకు చాలా ఉత్సాహంగా ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో ఆడేందుకు, అక్కడి వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ఎదురుచూస్తున్నాను. ఈ ఏడాది మాకు గొప్పగా ఉంటుందని ఆశిస్తున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2026 వేలంలో అతడిని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) రికార్డు స్థాయిలో రూ. 25.20 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో కేకేఆర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలో గ్రీన్ తన స్పందనను తెలియజేశాడు.

అబుదాబిలోని ఎతిహాద్ ఎరీనాలో మంగళవారం జరిగిన ఈ వేలంలో గ్రీన్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. గతంలో కేకేఆర్ జట్టు రూ. 24.75 కోట్లకు కొనుగోలు చేసిన తన సహచర ఆటగాడు మిచెల్ స్టార్క్ రికార్డును గ్రీన్ అధిగమించాడు. నిజానికి, రిజిస్ట్రేషన్‌లో పొరపాటు కారణంగా అతడి పేరు 'బ్యాటర్'గా నమోదైనప్పటికీ, తాను టోర్నమెంట్‌లో బౌలింగ్ కూడా చేస్తానని స్పష్టం చేశాడు.

రూ. 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చిన గ్రీన్ కోసం తొలుత కోల్‌కతా, రాజస్థాన్ రాయల్స్ పోటీపడ్డాయి. బిడ్ రూ. 13 కోట్లకు చేరిన తర్వాత రాజస్థాన్ తప్పుకోవడంతో, చెన్నై సూపర్ కింగ్స్ బరిలోకి దిగింది. అత్యధికంగా రూ. 64.30 కోట్ల పర్సుతో వేలంలోకి వచ్చిన కేకేఆర్, చివరి వరకు పోటీపడి గ్రీన్‌ను సొంతం చేసుకుంది. కామెరాన్ గ్రీన్ 2023లో ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. ఆనాడు అతడిని ముంబై జట్టు రూ. 17.5 కోట్లకు కొనుగోలు చేసింది.

ఐపీఎల్ వేలంలో శ్రీలంక యువ పేసర్ మతీశ పతిరణ జాక్‌పాట్ కొట్టాడు. అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీ ఏకంగా రూ.18 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. తన అసాధారణ బౌలింగ్ శైలితో గుర్తింపు పొందిన ఈ యార్కర్ స్పెషలిస్ట్ కోసం కేకేఆర్ తమ పర్సులోని అధిక మొత్తాన్ని వెచ్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొనుగోలుతో కోల్‌కతా బౌలింగ్ విభాగం మరింత పటిష్ఠంగా మారింది. ఇప్పటికే జట్టుతో ఉన్న అనుభవజ్ఞులైన టిమ్ సౌథీ, డ్వేన్ బ్రావోల మార్గదర్శకత్వంలో పతిరణ ఆడనున్నాడు. వీరిద్దరి పర్యవేక్షణలో అతని నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన పతిరణ, డెత్ ఓవర్లలో తన అద్భుతమైన బౌలింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు కేకేఆర్ తరఫున కూడా అదే ప్రదర్శనను పునరావృతం చేస్తాడని ఫ్రాంచైజీ యాజమాన్యం గట్టి నమ్మకంతో ఉంది. ఈ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లలో పతిరణ ఒకడిగా నిలిచాడు.

భారత ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. అతని కోసం రూ. 7 కోట్లు వెచ్చించి జట్టులోకి తీసుకుంది. గత మెగా వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) వెంకటేశ్ అయ్యర్‌ను ఏకంగా రూ. 23.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మినీ వేలానికి ముందు కేకేఆర్ అతడిని విడుదల చేయడంతో వెంకటేశ్ అయ్యర్ తిరిగి వేలం జాబితాలోకి వచ్చాడు. దీంతో ఆర్‌సీబీ అతడిపై ఆసక్తి చూపి పోటీపడి దక్కించుకుంది. గతంతో పోలిస్తే అతని ధర గణనీయంగా తగ్గడం గమనార్హం.




## జనవరి 12 థియేటర్స్‌లోకి రానున్న
# 'మన శంకర వరప్రసాద్ గారు'



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఈ చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2026 సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మేకర్స్ ఈ విషయాన్ని తెలిపారు.

ఈ సినిమాలో చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, విక్టరీ వెంకటేశ్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్–ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "చిరంజీవి, వెంకటేశ్ వంటి ఇద్దరు అగ్ర హీరోలను ఒకే ఫ్రేమ్‌లో డైరెక్ట్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను" అని ఆనందం వ్యక్తం చేశారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. "ఈ సినిమా ఫ్యాన్స్‌కు కచ్చితంగా ఒక పండగలా ఉంటుంది. 30 ఏళ్ల క్రితం చిరంజీవి గారు ఎలా డ్యాన్స్ చేశారో, మళ్లీ అదే ఎనర్జీ ఈ సినిమాలో చూపించారు" అని అన్నారు. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. సంక్రాంతి సీజన్‌లో పోటీ ఉన్నప్పటికీ, సోమవారం (జనవరి 12) విడుదల కానుండటంతో లాంగ్ వీకెండ్ కలెక్షన్లకు కలిసొస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్లాస్టిక్ సర్జరీ వార్తలపై రకుల్ ప్రీత్ సింగ్ ఏమన్నారంటే..!



నటి రకుల్ ప్రీత్ సింగ్ తన శరీరాకృతి కోసం ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ గా మారిన పోస్టుపై ఆమె స్పందించారు. వైద్యులమని చెప్పుకునే ఇలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అభిమానులను హెచ్చరించారు. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాననే ప్రచారాన్ని రకుల్ ప్రీత్ సింగ్ ఖండించారు. తెలిసీతెలియకుండా కొంతమంది తమ పోస్టులతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని రకుల్ విమర్శించారు.

ఇలాంటి పోస్టులు పెట్టేవారిని చూస్తే భయం కలుగుతుందని చెప్పారు. పురాతన పద్ధతులతో పాటు తాను మోడ్రన్ సైన్స్ ను కూడా నమ్ముతానని, ఒకవేళ ఎవరైనా ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే తాను తప్పుపట్టబోనని రకుల్ అన్నారు. వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గవచ్చని అందరూ తెలుసుకోవాలని రకుల్ ప్రీత్ సింగ్ సూచించారు.






# నటిపై లైంగిక దాడి కేసు తీర్పుపై స్పందించిన మంజు వారియర్



ప్రముఖ మలయాళ నటి మంజు వారియర్, 2017 నాటి 'నటిపై లైంగిక దాడి' కేసు తీర్పుపై స్పందించారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉన్నప్పటికీ, బాధితురాలికి న్యాయం ఇంకా అసంపూర్తిగానే ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొని, నిర్దోషిగా విడుదలైన నటుడు దిలీప్, మంజు వారియర్ మాజీ భర్త కావడం గమనార్హం.

తీర్పు వెలువడిన దాదాపు వారం రోజుల తర్వాత, మంజు వారియర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన నోట్ పంచుకున్నారు. "గౌరవనీయ న్యాయస్థానంపై నాకు అపారమైన గౌరవం ఉంది. కానీ ఈ కేసులో బాధితురాలికి న్యాయం ఇంకా పూర్తి కాలేదు. కేవలం నేరం చేసిన వారికి మాత్రమే శిక్ష పడింది. ఈ ఘోరానికి ప్రణాళిక రచించి, అమలు చేసిన అసలు సూత్రధారి ఎవరైనా సరే, వారు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇది చాలా భయానకం" అని ఆమె పేర్కొన్నారు.

ఈ నేరం వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టినప్పుడే న్యాయం పూర్తవుతుందని మంజు స్పష్టం చేశారు. "ఇది కేవలం ఒక బాధితురాలి సమస్య కాదు. కార్యాలయాల్లో, వీధుల్లో, జీవితంలో ధైర్యంగా, నిర్భయంగా తలెత్తుకుని నడవాలనుకునే ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ కోసం నేను మాట్లాడుతున్నాను. నేను ఆమెతో పాటు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఉంటాను" అని ఆమె తన పోస్టులో తేల్చి చెప్పారు.

ఎర్నాకుళం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఈ కేసులో దిలీప్‌ను నిర్దోషిగా ప్రకటించగా, ప్రధాన నిందితుడు సహా మరో ఆరుగురిని దోషులుగా నిర్ధారించిన విషయం తెలిసిందే.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**